సాక్షి నిర్మల్

మంగళవారం । 20 । జూన్ । 2023



ఆలయాలకు మహర్దశ 8లో▸

ధూప దీప నైవేద్యం పథకం ప్రారంభమైన నాటి నుంచి ఉమ్మడి జిల్లాలో నాలుగు విడతలుగా 484 మంది అర్చకులను నియమించారు. తాజాగా ప్రభుత్వం మరో 154 పోస్టులు మంజూరు చేసింది.



ట్రిపుల్ ఐటీ సమస్యలు పట్టవా..?

బాసర ట్రిపుల్‌ఐటీ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి ఆరోపించారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.4 /29.7

రోజంతా ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం ఒకటిరెండు చోట్ల చినుకులు పడొచ్చు.

న్యూస్‌రీల్

ప్రతీ పౌరుడికి పోలీస్ రక్షణ



అర్జీదారుని సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: జిల్లాలోని ప్రతీ పౌరునికి పోలీస్ రక్షణ ఉంటుందని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసుల సహాయం కావాలనుకునేవారు నేరుగా ఠాణాలో ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్య తిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. వాట్సాప్ నంబర్ 87126 59599కు అయినా సమాచారం ఇవ్వాలని సూచించారు.

మత్స్యకారుల ఫిర్యాదు

లోకేశ్వరం: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు తమకు అవకాశం కల్పించాలని మత్స్యకారులు ఎస్పీ ప్రవీణ్‌కుమార్, మత్స్యశాఖ ఏడీ, కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. కిష్టాపూర్ పెద్దచెరువులో ఏటా లోకేశ్వరం మత్స్యకారులు చేపలు పట్టేవారు. వచ్చిన లాభం సమానంగా పంచుకునేవారు. లోకేశ్వరం మత్స్యకారులు పూర్తిగా తమకే చెందాలని గతంలో జిల్లా మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువుకు సంబంధించిన శిస్తును చెల్లిస్తున్నందు రెండు గ్రామాలకు సమాన హక్కు కల్పించాలని కోరారు. ఫిర్యాదు చేసినవారిలో శ్రీనివాస్‌రెడ్డి, గణపతిరెడ్డి, సాయారెడ్డి, చిన్నయ్య, నర్సారెడ్డి ఉన్నారు.

'ధరణి' లోపాలు సవరించాలి



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ధరణి పోర్టల్‌లో లోపాలను సవరించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎన్‌.రెడ్డి, ఏఆర్ ఉపాలి అన్నారు. సీపీఐ అనుబంధ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం వినతిపత్రం అందించారు. వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని, పోడు రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని, కౌలు రైతులకు పంట పరిహారం ఇవ్వాలని కోరారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ ప్రకారం మద్దతు ధరలు నిర్ణయించాలని పేర్కొన్నారు. ధరణిలో లోపాలను సవరించడానికి, భూముల రీసర్వే చేసి కొత్త రికార్డులు రూపొందించాలని తెలిపారు.

పాత కలెక్టరేట్‌లోకి రూరల్ తహసీల్ కార్యాలయం

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ పీజీ వసతి గృహంలో కొనసాగుతున్న నిర్మల్ రూరల్ తహసీల్దార్ కార్యాలయాన్ని పాత కలెక్టరేట్ కార్యాలయం భవనం పైఅంతస్తుకు తరలించినట్లు తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి పాత కలెక్టర్ కార్యాలయం సేవలు పొందాలని సూచించారు.

విద్యుత్ కోసం వినతి



వినతిపత్రంతో రాగిదుబ్బ గిరిజనులు

నిర్మల్‌చైన్‌గేట్: పెంబి మండలం రాగిదుబ్బ నాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎస్ఈ జయత్‌చౌహాన్‌కు గిరిజనులు సోమవారం వినతిపత్రం అందించారు. 2007లో ఇందిరమ్మ పథకంలో భాగంగా విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరా ఏర్పాటు చేశారని తెలిపారు. తర్వాత అటవీశాఖ అధికారులు సుమారు 5 కిలోమీటర్ల సరఫరా లైన్లను తొలగించారని పేర్కొన్నారు. గ్రామానికి విద్యుత్ సరఫరా కోసం ఆదిలాబాద్ జిల్లా ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ నిరభ్యంతర పత్రం పంపించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరారు.

వైద్యుల నియామకానికి నేడు ఇంటర్వ్యూ

నిర్మల్‌చైన్‌గేట్: నేషనల్ హెల్త్ మిషన్ కింద జిల్లాలో కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్యుల నియామకానికి మంగళవారం ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ తెలిపారు. ఎంఎస్ ఓబీజీ, డీజీవో అర్హత ఉన్న వైద్యులు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయానికి నేరుగా రావాలని సూచించారు. ఉదయం 10:30 గంటలకు ఇంటర్వ్యూ ప్రారంభం అవుతుందని తెలిపారు.

దూరం.. భారం!



ఈ ఫొటోలోని దివ్యాంగురాలి పేరు లక్ష్మి. నిర్మల్ రూరల్ మండలం రాణాపూర్‌కు చెందిన లక్ష్మి తమ సమస్యపై ప్రజావాణిలో అర్జీ పెట్టుకునేందుకు సోమవారం వచ్చింది. రాణాపూర్ నుంచి నిర్మల్ రావడానికి ఆమెకు అయిన ఖర్చు రూ.50. మొదట పాత కలెక్టరేట్ వద్దకు వెళ్లింది. అక్కడి అధికారులు నూతన కలెక్టరేట్‌లో ప్రజావాణి ఉంటుందని చెప్పడంతో నూతన కలెక్టరేట్ వెళ్లేందుకు ఆటో కోసం వెళ్లింది. అందుకు సదరు ఆటోవాలా రూ.200 అడిగాడు. గ్రామం నుండి జిల్లా కేంద్రానికి రావడానికి కేవలం 50 రూపాయలు తీసుకుంటే.. జిల్లా కేంద్రంలో ఉన్న కలెక్టరేట్ వెళ్లేందుకు రూ.200 వెచ్చించింది. ఈ సమస్య ఒక్క లక్ష్మిదే కాదు. ప్రజావాణికి వచ్చిన చాలా మంది నూతన కలెక్టరేట్‌కు వెళ్లేందుకు రూ.200 ఖర్చు చేయాల్సి వచ్చింది.



ప్రజావాణికి అదనపు కలెక్టర్ రాంబాబు లేటుగా రావడంతో క్యూలో బారులుతీరిన అర్జీదారులు

- 'సమీకృతం'లో ప్రజావాణి ప్రారంభం
- కొత్త కలెక్టరేట్ వెళ్లేవారికి చార్జీల మోత
- బస్టాండ్ నుంచి రూ.200 వసూలు చేసిన ఆటో వాలాలు
- అదనపు భారంపై అర్జీదారుల ఆందోళన

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కొత్త జిల్లాలు ఏర్పాటు చేసింది. అన్ని ప్రభుత్వ సేవలు ఒకేచోట అందించేందుకు సమీకృత భవనాలు నిర్మించింది. ఈనెల 4న సీఎం కేసీఆర్ నిర్మల్ సమీకృత కార్యాలయాన్ని ప్రారంభించారు. నూతన భవనంలో సోమవారం మొదటిసారిగా ప్రజావాణి నిర్వహించారు. వివిధ కార్యక్రమాల్లో బిజీగా ఉన్న కలెక్టర్ తొలి ప్రజావాణికి హాజరు కాలేదు. అదనపు కలెక్టర్ రాంబాబు ఫిర్యాదులు స్వీకరించారు.

11:44 గంటలకు తొలి ఫిర్యాదు..

ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజావాణి 11:44 గంటలకు ప్రారంభమైంది. పాత కలెక్టరేట్‌లో పరిష్కారం కాని తమ సమస్యలు నూతన కలెక్టరేట్‌లో అయినా పరిష్కారం కాకపోతాయా అన్న ఆశతో ఫిర్యాదుదారులు అధిక సంఖ్యలో వచ్చారు. అదనపు కలెక్టర్ రాంబాబు 11:44 గంటలకు తొలి ఫిర్యాదును స్వీకరించారు.

ఆశతో వచ్చి.. పడిగాపులు పడి

ఉదయం 11 గంటలకు ప్రజావాణి సమావేశ మందిరానికి వెళ్లి చూడగా అప్పటికే అక్కడ సుమారు 200 మందికిపైగా బాధితులు ఉన్నారు. అర్జీలు స్వీకరించే వారు లేకపోవడంతో నిరీక్షణ తప్పలేదు. సుదూర ప్రాంతాలకు చెందిన వారు ఉదయం 10 గంటలకే చేరుకున్నారు. తాగేందుకు నీరు లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు.

పూర్తికాని పనులు..

నూతన కలెక్టరేట్ ప్రారంభమైనా ఇంకా కొన్ని శాఖలకు సంబంధించి పనులు పూర్తికాలేదు దీంతో కేవలం సోమవారం ప్రజాఫిర్యాదుల విభాగం మాత్రమే అధికారులు ఆగమేఘాల మీద తయారు చేసినట్లు కనిపిస్తుంది. పలు శాఖలకు భవనాలు కేటాయించినా పూర్తిస్థాయిలో ఫర్నిచర్, విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించకపోవడంతో సంబంధిత శాఖల అధికారులు నామమాత్రంగా వచ్చి కూర్చుని వెళ్లిపోయారు.

తోపులాట....

వెయిటింగ్ హాల్‌లో దాదాపు గంటన్నరకుపైగా వేచి ఉన్న అర్జీదారులు అదనపు కలెక్టర్ వచ్చి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారని తెలియడంతో ఒక్కసారిగా అందరూ తోచుకుంటూ వెళ్లారు దీంతో తోపులాట జరిగింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు గేట్లు వేసి, ఐదుగురు చొప్పున ప్రజావాణి సమావేశమందిరంలోకి అనుమతించారు.

బస్సు వేయాలని వినతి..

నూతన కలెక్టరేట్ నిర్మల్‌కు సుమారు 7 కిలోమీటర్ల దూరం ఉందని, ఆటోవాలాలు రూ.200 చార్జి వసూలు చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. బస్టాండ్ నుంచి కొత్త కలెక్టరేట్ వరకు ఆర్టీసీ బస్సు నడపాలని పలువురు కోరారు. నిత్యం కార్యాలయానికి వచ్చే అధికారులు, ఉద్యోగుల తోపాటు, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆటోవాలాల దోపిడీ నుంచి పేదలకు విముక్తి లభిస్తుందని తెలిపారు.

22న జెడ్పీ ప్రత్యేక సమావేశం

నిర్మల్ రూరల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 22న జెడ్పీ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఈవో సుధీర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ విజయలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల నిర్వహణలో భాగంగా అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి, రెండు నిమిషాల మౌనం పాటించి పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో ధనరాజ్

నిర్మల్‌చైన్‌గేట్: వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలో అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా సాధించిన ప్రగతిని సమీక్షించారు. వైద్య సేవల్లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారులు రాజేందర్, ఇద్రిస్‌గౌరీ, జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారులు రవీందర్ రెడ్డి, నయనారెడ్డి, శ్రీనివాస్, నిఖిలారాణి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు పాల్గొన్నారు.

దశాబ్ది వేడుకల్లో.. విద్య సంబురాలు



జిల్లా పాఠశాల విద్యాశాఖ సిద్ధం చేసిన ప్రదర్శన బోర్డులు

- నేడు తెలంగాణ విద్యాదినోత్సవం నిర్వహణ
- జిల్లా కేంద్రంలో వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

నిర్మల్ ఖిల్లా : రాష్ట్రం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తయి పదో వసంతంలోకి అడుగుపెడుతున్న చారిత్రక సందర్భంలో తెలంగాణ ప్రభుత్వం జూన్ 2 నుంచి 21 రోజులు ఉత్సవాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం విద్యాదినోత్సవం నిర్వహించనున్నారు. ఈమేరకు విద్యాశాఖ అధికారులు జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, దండె విఠల్, కూర రఘోత్తం రెడ్డి, ఎమ్మెల్యేలు రేఖానాయక్, విఠల్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ తదితరులు పాల్గొంటారు.

గ్రామస్థాయి కార్యక్రమాలు..

పాఠశాల విద్యార్థులతో ర్యాలీ, తల్లిదండ్రులు, గ్రామస్తులకు ఆహ్వాన కరపత్రాలు, పదేళ్లలో విద్యారంగంలో సాధించిన విజయాలతో కూడిన కరపత్రాల పంపిణీ, పాఠశాల విద్యార్థులతో గ్రామ కూడళ్లలో విద్యారంగం అభివృద్ధిపై ప్రదర్శనలు ఉంటాయి.

పాఠశాలస్థాయి కార్యక్రమాలు..

ఉదయం జాతీయ పతాకావిష్కరణ అనంతరం అతిథులను వేదికపై పిలిచి తెలంగాణలో సాధించిన విజయాలను గ్రామ ప్రజలకు, తల్లిదండ్రులకు తెలియజేయడం. ప్రజా ప్రతినిధులు, సభ్యుల సందేశాలు మన ఊరు మనబడి పాఠశాలల ప్రారంభోత్సవం, ఉన్నత పాఠశాల డిజిటల్ తరగతులు, గ్రంథాలయాల ప్రారంభోత్సవం ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి సన్మానం, వ్యాసరచన, చిత్రలేఖనం, పాటల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ.

జిల్లాస్థాయి కార్యక్రమాలు..

సాయంత్రం ఏర్పాటు చేసే జిల్లాస్థాయి కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులను పిలువడం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులు ఎస్‌ఎంసీ కమిటీలను ఆహ్వానించడం.. అనంతరం ఆయా పాఠశాలకు కేటాయించిన ట్యాబులను పంపిణీ చేయడం, అనంతరం జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, పది మంది ఉత్తమ ప్రధానోపాధ్యాయులు, 15 మంది ఉత్తమ ఉపాధ్యాయులు, ఐదుగురు ఉత్తమ తల్లిదండ్రులు, ఐదు ఉత్తమ ఎస్‌ఎంసీలను సత్కరిస్తారు.

సంబురంగా నిర్వహణ...



రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తెలంగాణ విద్యాదినోత్సవ నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే అధికారులకు, ఎంఈవోలకు, ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చాం. సాయంత్రం జిల్లా కేంద్రంలో విద్యాదినోత్సవం నిర్వహిస్తాం.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీఈవో

సేంద్రియ వ్యవసాయం చేయాలి



మొక్క నాటుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి

కడెం: రైతులంతా సేంద్రియ వ్యవసాయం చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్‌లో సెరీకల్చర్ సీడ్‌ఫాంలో గ్రామీణాభివృద్ధి శాఖ అధ్వర్యంలో ఐదు అంచెల ప్రకృతి వ్యవసాయంపై సోమవారం సదస్సు నిర్వహించారు. కలెక్టర్ హాజరై మాట్లాడారు. రసాయన ఎరువులు, పురుగు మందుల సాగును క్రమంగా తగ్గిస్తూ ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. సేంద్రియ సాగుతో పెట్టుబడి కూడా తగ్గుతుందని, విషతుల్యం కాని పంటలు పండుతాయని తెలిపారు. సుభాష్ పాలేకర్ స్ఫూర్తితో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన శరత్ అనే రైతు ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. నచ్చన్‌ఎల్లాపూర్ సీడ్ ఫాంలో రెండు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ మోడల్ ఫాం ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్డీవో విజయలక్ష్మి తెలిపారు. అనంతరం హరితోత్సవంలో భాగంగా ఆటవీ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. తహసీల్దార్ చిన్నయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డీఏవో అంజిప్రసాద్, ఎంపీవో ఉపేందర్, ఆత్మా కమిటీ చైర్మన్ సతీశ్, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్, సర్పంచ్ బొడ్డు గంగన్న, ఏవో సంధ్యారాణి, హెచ్‌వో మానిక రైతులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- ఎస్పీ ప్రవీణ్‌కుమార్



మొక్క నాటి నీరు పోస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, భావితరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన హరితోత్సవంలో పోలీస్ కార్యాలయ ఆవరణంలో ఎస్పీ మొక్కలు నాటారు. అందరూ మొక్కలు నాటి వాటిని కాపాడే బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ రవీందర్ రెడ్డి, నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, రామకృష్ణ, ఆర్ ఎస్‌ఐలు,పోలీస్‌కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి పచ్చదనం పెంచాలి

మామడ: మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలని డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. మామడ పోలీస్ స్టేషన్‌లో సోమవారం హరితోత్సవం నిర్వహించారు. మొక్కలు నాటి మాట్లాడారు. వనాల సంరక్షణతోనే స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. సీఐ నవీన్ కుమార్, ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

ఆకుపచ్చ తెలంగాణనే లక్ష్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి
- జిల్లా కేంద్రంలో ఘనంగా హరితోత్సవం



మొక్క నాటుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

నిర్మల్‌టౌన్: ఆకుపచ్చ తెలంగాణను ఆవిష్కరించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా ఏటా హరితహారం కార్యక్రమం నిర్వహిస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో సోమవారం హరితోత్సవం నిర్వహించారు. పట్టణంలోని సోఫీనగర్‌లో రహదారికి ఇరువైపులా, డంపింగ్ యార్డ్‌ప్రాంతంలో మొక్కలు నాటారు. అంతకుముందు అ టవీ శాఖ కార్యాలయంలో నిర్వహించిన హరితో త్స వం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వా రు మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతోపాటు వా టిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నా రు. మొక్కలు నాటడం ద్వారా మానవాళికి ఆరోగ్యవంతమైన–ఆహ్లాదకరమైన వాతావరణం అందించొచ్చని తెలిపారు. ఇప్పటికే పట్టణంలో విరివిగా మొక్కలు నాటామని, దీంతో నిర్మల్ పట్టణం ఎటు చూసినా ఆకుపచ్చ తోరణంలా కనిపిస్తోందని అన్నారు. కార్యక్రమంలో బాసర సర్కిల్ అటవీ అధికారి శర్వానంద్, డీఎఫ్‌వో సునీల్ హిరమత్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జైపాల్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురారి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పొనికి వనాన్ని సంరక్షించాలి..

మామడ: మండలంలోని లింగాపూర్ గ్రామంలో నిర్వహించిన హరితోత్సవంలోనూ జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి పాల్గొన్నారు. కొయ్యబొమ్మల తయారీకి ఉపయోగించే పొనికి కర్ర ఉత్పత్తి కోసం పెంచుతున్న వనాన్ని సంరక్షించుకోవాలని సూచించారు. ఏటా నిర్వహిస్తున్న హరితహారంతో రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం పెరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. అనంతరం పొనికి వనంలో మొక్కలు నాటారు. డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎఫ్‌వో సునీల్ ఐరావ త్, సీసీఎఫ్ శర్వానంద్, సర్పంచ్ అంబిబాయి, భాస్కర్‌రావ్, బీఆర్‌ఎస్ కన్వీనర్ చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

'డైస్' సేవలు అందేదెప్పుడో..!

- రూ.85 లక్షలతో భవనం
- నిర్మాణం పూర్తయి ఐదేళ్లు
- సిబ్బంది నియామకానికి ఫిబ్రవరిలో నోటిఫికేషన్



నిరుపయోగంగా ఉన్న డైస్ కేంద్రం

నిర్మల్‌చైన్‌గేట్: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్ వేషన్ సెంటర్ (డీఈఐసీ)ను నిర్మల్‌కు రాష్ట్ర ప్రభుత్వం 2014–15 ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసింది. అప్పట్లో ఈ భవన నిర్మాణం కోసం రూ.85 లక్షల నిధులు మంజూరు చేశారు. జిల్లా ప్రసూతి ఆసుపత్రి పై అంతస్తులో 2019లో భవన నిర్మాణం పూర్తి చేసిన కాంట్రాక్టర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు భవనాన్ని అప్పగించాడు. అయితే ఐదేళ్లు గడిచినా వైద్య పరికరాలు సమకూర్చలేదు. కనీసం సిబ్బందిని నియమించలేదు.

ఫిబ్రవరిలో నోటిఫికేషన్...

డైస్ కేంద్రంలో సిబ్బంది నియామకానికి గత ఫిబ్రవరి 20న వైద్య ఆరోగ్య శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. నాలుగు నెలలు గడిచినా ఇప్పటికీ నియామక ప్రక్రియ చేపట్టలేదు. దీంతో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నియామక ప్రక్రియ ఎప్పుడు జరుగుతుందో అని ఎదురుచూస్తున్నారు.

అందుబాటులోకి వస్తే ప్రయోజనాలు

డైస్ కేంద్రం అందుబాటులోకి వస్తే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించడం, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించడం చేస్తారు. చిన్న పిల్లల వైద్యులు, ఫిజియోథెరపిస్ట్, స్పీచ్ థెరపిస్ట్, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ఇలా వివిధ విభాగాలకు చెందిన నిపుణులు వైద్య సిబ్బంది సుమారు 15 నుంచి 20 వరకు అందుబాటులోకి వస్తారు. మాటలు సరిగా మాట్లాడ లేని వారికి స్పీచ్ థెరపీ, అంగవైకల్యం ఉన్నవారికి ఫిజియోథెరపీ లాంటి చికిత్సలు అందిస్తారు. మూగ, చెవిటి, మానసిక దివ్యాంగులకు అవసరమైన వైద్య సహాయం అందుతుంది. మానసిక నిపుణులు సైతం అందుబాటులో ఉండటం వల్ల మనోవైకల్య సమస్య పరిష్కారం అవుతుంది.

ఊడుతున్న టైల్స్...

డైస్ కేంద్రం ఏర్పాటు చేసి ఐదేళ్లు పూర్తయినా భవనం మాత్రం నిరుపయోగంగానే ఉంది. దాదాపు రూ.85 లక్షలతో నిర్మించిన ఈ భవనాన్ని నాణ్యత పాటించకపోవడంతో టైల్స్ ఎక్కడికక్కడే ఊడిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డైస్ కేంద్రం అందుబాటులోకి తీసుకువచ్చి సామాన్య ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందేలా చూడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

నియామకాలు చేపడతాం



డైస్ కేంద్రానికి సంబంధించి ఫిబ్రవరిలో 11 విభాగాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశాం. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేశాం. త్వరలోనే మెరిట్ ప్రకారం అభ్యర్థులను ఎన్నుకొని నియామక పత్రాలు అందిస్తాం. – డాక్టర్ ధనరాజ్, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ లభ్యం


పిట్ల బాపూరావ్

బోథ్: తిరుమలలో తప్పిపోయిన బోథ్‌కు చెందిన పిట్ల బాపూరావ్ ఆచూకీ లభ్యమైంది. ఆపసోపాలు పడి సోమవారం ఇంటికి తిరిగిరావడంతో కుటుంబసభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలకేంద్రంలోని కొత్తకాలనీకి చెందిన పది మందితో కలిసి పిట్ల బాపూరావ్ వారం క్రితం తిరుమలకు వెళ్లాడు. దర్శనంలో భాగంగా క్యూలో తప్పిపోయాడు. వారు తిరుమల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తిరుపతి నుంచి తెలియక బెంగుళూరుకు రైలులో వెళ్లాడు. అక్కడి పోలీసులు ఆయన ఆధార్‌కార్డు ఆధారంగా నాందేడ్ రైలు ఎక్కించారు. నాందేడ్‌లోని పోలీసులు ఆదిలాబాద్‌కు రైలులో పంపించగా, బోథ్ నుంచి 20 కి.మీ దూరంలోని బొందిడి వద్ద బాపూరావ్ దిగిపోయాడు. కాలినడకన ఇంటికి చేరుకున్నాడు. వారం రోజులుగా తినడానికి అనేక అవస్థలు పడ్డానని తెలిపాడు. పోలీసులు తన ఆకలి తీర్చారని, పలు ఆలయాల్లో తిన్నట్లు బాపూరావ్ తెలిపాడు.

డిగ్రీ పరీక్షల్లో 11 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షల్లో సోమవారం 11 మంది డిబార్ అయ్యారు. ఉట్నూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడడంతో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పట్టుకుని డిబార్ చేసినట్లు కాకతీయ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ నరేందర్ తెలిపారు.

ఆటోను ఢీకొన్న బైక్

- నలుగురికి స్వల్పంగా, ఒకరికి తీవ్రగాయాలు

కడెం: కడెం–పెద్దూర్ రహదారిపై ఎదురుగా వస్తున్న ఆటోను బైక్ ఢీకొంది. ఈ ఘటనలో నలుగురికి స్వల్పంగా, ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. కడెం నుంచి ఖానాపూర్ వైపు ఇద్దరు బైక్‌పై వెళ్తున్నారు. సోమవారం పెద్దూర్ సమీపంలో మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్నారు. పెద్దూర్‌కు చెందిన బీజేపీ నాయకుడు రవీందర్‌గౌడ్ క్షతగాత్రులను ఆటోలో ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై రాజు పేర్కొన్నారు. అయితే అప్పటికే మూలమలుపు వద్ద జరిగిన ప్రమాదంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డ వాళ్లను చూస్తూ..అజాగ్రత్తగా నడపటం వల్లనే ఆటోను ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు.

స్క్రాప్ దుకాణాల్లో అగ్ని ప్రమాదం


దుకాణంలో వ్యాపించిన మంటలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని జీఎస్ ఎస్టేట్ సమీపంలోని గణేశ్ మందిరం వద్ద గల రెండు స్క్రాప్ దుకాణాల్లో సోమవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శివాజీ మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు సిగరేట్ తాగి పడేయడంతో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పేర్కొన్నారు.

ఆలయాలకు మహర్దశ


డీడీఎన్ పథకంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయం

ఆసిఫాబాద్‌అర్బన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఆలయాలకు నిత్యం ధూప దీప నైవేద్యాలు జరగాలన్న ఉద్దేశంతో పాటు, అర్చకులకు ఉపాధి కల్పించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2007లో ధూప దీప నైవేద్య(డీడీఎన్) పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా నెలకు గౌరవ వేతనం రూ. 2వేలు చెల్లించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ రూ.2వేలు ఉన్న వేతనాన్ని రూ.6 వేలకు పెంచారు.

- ఉమ్మడి జిల్లాకు 184 పోస్టులు మంజూరు
- ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నవారు 484 మంది
- తాజా నిర్ణయంతో 638కి చేరిన డీడీఎన్ అర్చకులు
- ఇటీవలే రూ.10వేలకు పెరిగిన గౌరవ వేతనం

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	ప్రస్తుతం డీడీఎన్ అర్చకుల సంఖ్య	నూతనంగా మంజూరైన అర్చకుల సంఖ్య	మొత్తం
ఆదిలాబాద్	111	24	135
కుమురంభీం	69	09	78
మంచిర్యాల	142	18	160
నిర్మల్	162	103	265
మొత్తం	484	154	638

నిర్వహణ ఇలా..

దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ధూప దీప నైవేద్యం పథకం కొనసాగుతుంది. ఆలయాల్లో విధులు నిర్వహించే అర్చకులు ప్రతీరోజు ఆలయంలో నిత్యపూజ, నైవేద్యంతో పాటు పండుగలు, ఉత్సవాల సమయాల్లో ప్రత్యేక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాల్సి ఉంటుంది. ప్రభుత్వం ప్రస్తుతం డీడీఎన్ అర్చకులకు నెలకు రూ.6వేలు చెల్లిస్తుండగా అందులోంచి నూనె, ప్రసాదం, ఇతర ఖర్చులకు రూ.2వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. సీఎం కేసీఆర్ ఇటీవల మంచిర్యాల పర్యటనలో భాగంగా డీడీఎన్ అర్చకులకు ఇచ్చే వేతనం రూ.10వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు.

ఉమ్మడి జిల్లాలో 484 మంది అర్చకులు

పథకం ప్రారంభమైన నాటి నుంచి నాలుగు విడతలుగా 484 మంది అర్చకులను నియమించారు. తాజాగా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మరో 154 పోస్టులకు నియామక ఉత్తర్వులు జారీ చేయడంతో వీటి సంఖ్య 638కి చేరింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 9, మంచిర్యాలలో 18, ఆదిలాబాద్‌లో 24, నిర్మల్‌లో 103 ఆలయాలకు అర్చకులను నియమించింది. వీరికి ఈ నెల 25న ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా ఉత్తర్వులు అందజేయనున్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల్లో అర్చకులకు డీడీఎన్ పథకంలో అవకాశం కల్పించడం హర్షణీయం. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. కానీ జిల్లాలో కేవలం 9 మందికే అవకాశం కల్పించడంతో చాలామందికి నిరాశే మిగిలింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి పూర్తిస్థాయిలో అర్చకులకు అవకాశం కల్పించాలి.

– గంగు సత్యనారాయణశర్మ, డీడీఎన్ సంఘం జిల్లా కార్యదర్శి

నియామకాల్లో పారదర్శకత

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డీడీఎన్ పోస్టుల నియామకాల్లో పారదర్శకత పాటించాం. దరఖాస్తులను పరిశీలించి, ఆలయాలను తనిఖీలు చేసి, అర్హులైన వారిని గుర్తించాం. అర్చకులు సక్రమంగా విధులు నిర్వర్తించాలి. తనిఖీల్లో పట్టుపడితే శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. సమయపాలన పాటించాలి.

– నవీన్‌కుమార్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఉమ్మడి ఆదిలాబాద్

మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

పాతమంచిర్యాల: ఆయుష్మాన్ భారత్ ఇన్సూరెన్స్ కార్డులు ఇప్పిస్తానని మోసాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాండూర్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీసీపీ కార్యాలయంలో సోమవారం వివరాలు వెల్లడించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్టు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాయిని బాపు సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో మాదారం, తిర్యాణి, దేవాపూర్, కాసిపేటలలో పలువురు అమాయక గిరిజనులకు ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇస్తామని చెప్పి నకిలీ కార్డులు చూపించి నమ్మించాడు. బయోమెట్రిక్ యంత్రంలో వేలుముద్రలు స్కాన్ చేసి పదిమంది ఖాతాల్లోంచి రూ.2.73 లక్షలు తన ఖాతాలోకి బదిలీ చేసుకున్నాడు. బాధితులు మాదారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా తాండురు ఐబీలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా సోమవారం పట్టుబడ్డాడు. నిందితుడిని విచారించగా నేరం ఒప్పుకోవడంతో అతనిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితుడి వద్ద నుంచి హీరోహోండా బైక్, బయోమెట్రిక్ మిషన్, రెండు ఫోన్లు, నకిలీ ఆయుష్మాన్ భారత్ కార్డులు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో మాదారం ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి


సంగీత (ఫైల్)

గుడిహత్నూర్: విద్యుత్‌షాక్‌తో మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని కొల్హారీ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఇంద్రవెల్లి మండలం జాలంతండాకు చెందిన సంగీత (33), కొల్హారీకి చెందిన తగరే కోర్బాన్‌తో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు చిన్నారులు బబ్లూ, రాహుల్. దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఎప్పటిలాగే సంగీత చిన్నారులను బడికి పంపి ఇంటి పనుల్లో నిమగ్నమైంది. ఈ క్రమంలో మంచానికి ఆనుకొని ఉన్న ఇనుప కూలర్‌కు ఆమె కుడిభుజం తగిలి కరెంట్ షాక్‌కు గురైంది. ఆ భాగం పూర్తిగా కాలిపోయింది. ఇంటి నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి కరెంట్ ఆఫ్ చేశారు. అప్పటికే సంగీత మృతి చెంది ఉంది. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బాధిత కుటుంబానికి ఏఈ గౌతం రూ.10 వేల నగదు అందజేశారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- డీడీ దిలీప్‌కుమార్


అర్జీలు స్వీకరిస్తున్న దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: అర్జీలు సత్వరం పరిష్కరించాలని డీడీ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. అంతకు ముందు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన హరితదినోత్సవం పురస్కరించుకొని ఐటీడీఏ ఆవరణలో అధికారులు సిబ్బంది మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఓఎస్డీ కృష్ణయ్య, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, ఐటీడీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- దంతన్‌పల్లి పీహెచ్‌సీలో అటెండర్ ఉద్యోగం ఇప్పించాలని ఇంద్రవెల్లి మండలానికి చెందిన కుమ్ర సత్యవతి అర్జీ సమర్పించింది.
- ఉట్నూర్ మండలం దంతన్‌పల్లి (చెరువుగూడ) గ్రామానికి వసతి గృహం మంజూరు చేయించాలని సోయం జంగు కోరాడు.
- డిగ్రీ కళాశాలలో స్వీపర్‌గా ఉద్యోగం ఇప్పించాలని ఆసిఫాబాద్ మండలం కేస్లాపూర గ్రామానికి చెందిన టీకం కవిత విన్నవించింది.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఏఐసీసీ ఆదివాసీ జాతీయ ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్


అభివాదం చేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు ఏఐసీసీ ఆదివాసీ జాతీయ ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక తిరుమల ఫంక్షన్ హాల్‌లో టీపీసీసీ గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్ చౌహాన్ అధ్యక్షతన సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎస్టీ సెల్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బెల్లయ్య నాయక్ హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ మోసపూరిత వాగ్దానాలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిని కార్యకర్తలకు ఇంటింటికెళ్లి వివరించాలన్నారు. పార్టీ అధికారంలో వస్తే సిలిండర్ రూ.500, బస్సులో ఉచిత ప్రయాణం, రూ.2 లక్షల రుణమాఫీ, 2 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తుందని అవగాహన కల్పించాలన్నారు. ప్రజల్లో తిరిగే నాయకులకు గుర్తింపు ఉంటుందని, టికెట్ నిర్ణయించేది అధిష్టానమే అని తెలిపారు. జిల్లాలో ఉన్న పది సీట్లు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని తెలిపారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు గోమాసే శ్రీనివాస్, వెడ్మ భొజ్జు పటేల్, డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, నరేశ్‌జాదవ్, విశ్వప్రసాద్, మర్సుకోల సరస్వతి, సెడ్మకి ఆనంద్ రావు, మండల అధ్యక్షుడు రాజేశ్వర్, ప్రభాకార్, పుర్కబాపురావు తదితరులు పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత


దేశీదారును పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

బోథ్: మండలంలోని నాగుగుడ సమీపంలో దేశీదారు బాటిళ్లతో వెళ్తున్న ఒకరిని ఎక్సైజ్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ రాజమౌళి కథనం ప్రకారం.. సొనాల గ్రామానికి చెందిన కటారి దశరథ్ దేశీదారు బాటిళ్లను మోపెడ్‌పై తీసుకువసున్నారని సమాచారం అందింది. ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద కాపు కాస్తుండగా నాగగూడ వద్ద తనిఖీ చేశారు. 200 దేశీదారు బాటిళ్లు లభ్యం కాగా, వీటి విలువ రూ.8 వేలు ఉంటుందని తెలిపారు. దశరథ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాకేశ్, ఎక్సైజ్ ఎస్సైలు రాజేశ్వర్, లోబానంద్, సిబ్బంది పాల్గొన్నారు.

స్కానింగ్ కోసం గర్భిణుల పాట్లు!


క్యూలో నిలబడిన గర్భిణులు

భైంసాటౌన్: భైంసా ప్రభుత్వ ఏరియాస్పత్రిలో గర్భిణులు, రోగులు స్కానింగ్ కోసం ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువగా ఉండడంతో వైద్యపరీక్షల కోసం గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వచ్చింది. దీనికి తోడు స్కానింగ్ గది వద్ద రోగులు, వారి బంధువుల రాకపోకలతో తోపులాటతో గర్భిణులు ఇబ్బందులు పడ్డారు.

విద్యుత్ ప్రమాదంలో కాంట్రాక్టు ఉద్యోగికి గాయాలు

సారంగపూర్: విద్యుత్ ప్రమాదంలో కాంట్రాక్టు ఉద్యోగికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని గోపాల్‌పేట్‌కు చెందిన విద్యుత్ శాఖ కాంట్రాక్టు ఉద్యోగి రాజేశ్వర్.. ఓరైతు తన పొలంలో విద్యుత్ సరఫరాలో సమస్య ఉండటంతో సోమవారం ఆయనకు సమాచారం ఇచ్చాడు. లైన్‌లో సమస్య ఉందని సరిచేసేందుకు(ఎల్‌సీ) స్తంభం ఎక్కి రాజేశ్వర్ మరమ్మతు చేస్తుండగా వైరుకు సరఫరా రావడంతో ఆయన చేయి కాలిపోయింది. రైతు అతన్ని నిర్మల్‌లోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించాడు. ఈవిషయమై విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా తనకు విషయం తెలియదన్నారు. ప్రస్తుతం రాజేశ్వర్ ఆరోగ్యం నిలకడగా ఉందని, అతన్ని డిశ్చార్జ్ చేయించి గ్రామానికి పంపించినట్లు ఏఈ సాయికిరణ్ తెలిపారు.

వర్షం కురవాలని రుద్రాభిషేకం

బోథ్: వర్షాలు ఆలస్యమవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. విత్తనాలు సైతం ఇంకా విత్తలేదు. వర్షం కురవాలని కోరుతూ రైతులు, గ్రామస్తులు మండల కేంద్రంలోని శివభక్త మార్కండేయ ఆలయంలో సోమవారం రుద్రాభిషేకం నిర్వహించారు. వానలు సమృద్ధిగా కురవాలని మొక్కుకున్నారు. రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఒర్రెలో పడ్డ ట్రాక్టర్

- డ్రైవర్ మృతి


బోల్తాపడిన ట్రాక్టర్

పెంబి: దుక్కి దున్నుతుండగా ట్రాక్టర్ ప్రమాదవశాత్తు ఒర్రెలో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై రజినీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని షెట్‌పల్లి గ్రామానికి చెందిన టీకం జీవన్ (35) తనకు ఉన్న ట్రాక్టర్‌తో రావిగడ శివారులో సోమవారం దుక్కి దున్నుతున్నాడు. ప్రమాదవశాత్తు చిన్న ఒర్రెలో ట్రాక్టర్ పడి పల్టీ కొట్టడంతో జీవన్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సునీత, ఏడాది వయస్సు ఉన్న కుమారుడు ఉన్నాడు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోదారమ్మకు హారతి



భైంసా: బాసరలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం బాసర ఆలయం నుంచి గోదావరి నది వరకు పూజార్లు, సిబ్బంది, అధికారులు భక్తులతో కలిసి నృత్యాలు చేస్తూ వెళ్లారు. గోదారమ్మకు హారతి ఇచ్చారు. మహిళల కోలాటం, భజనలు, నృత్యాలతో గోదావరి నది పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కనిపించాయి.

ధర్మసమాజ్ పార్టీ ఆవిర్భావ సభ

ఆదిలాబాద్‌రూరల్: పట్టణంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఆవిర్భావ సభ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన సభకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆయన్ను పార్టీ నాయకులు మావల మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44 నుంచి ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి నిర్వహించిన బైక్ ర్యాలీని ఆదిలాబాద్‌లోని వివిధ చౌక్‌ల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ అంబేద్కర్, పూలే, మహాత్మా జ్యోతిబాపూలే, కాన్షీరాం ఆశయాల సాధన కోసం కృషి చేయాలన్నారు.

హరితహారం అడ్డుకున్న గ్రామస్తులు

ఇచ్చోడ: మండలంలోని బావోజీపేట్ గ్రామంలో సోమవారం అటవీ అధికారులు చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. గత ఏడాది నుంచి గ్రామానికి వచ్చే త్రీఫేజ్ కరెంట్ రాకుండా అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న సిరిచెల్మ టైగర్ జోన్ అటవీ అధికారి వాహబ్ అహ్మద్ అక్కడికి చేరుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడారు. త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కోసం సహకరిస్తామని చెప్పడంతో వారు శాంతించారు. తర్వాత హరితహారం కార్యక్రమాన్ని అటవీశాఖ ఆధికారులు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

భైంసాటౌన్: ముధోల్ మండలం తరోడ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్సై సాయికిరణ్ కథనం ప్రకారం.. కుభీర్ మండలం దొడర్న తండా–4కు చెందిన జాదవ్ అనిల్(27) నిజామాబాద్‌లోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి నిజామాబాద్‌లో హోటల్ యజమాని శుభకార్యానికి హాజరై తిరిగి బైక్‌పై భైంసా వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో తరోడ వద్ద భైంసా వైపు నుంచి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారమందుకున్న ఎస్సై అక్కడికి చేరుకుని మృతదేహాన్ని భైంసాలోని ఏరియాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య నిఖిత ఉన్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రతిభ పురస్కారాలకు ఎంపిక


పీజీ.రెడ్డి డాక్టర్ సుధాకర్ రవికుమార్ సుభాష్


పవన్ పాండే

నిర్మల్ రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగే విద్యా దినోత్సవంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, అధ్యాపకులకు రాష్ట్ర కళాశాల విద్యాశాఖ పురస్కారాలు ప్రదానం చేయనుంది. జిల్లా నుంచి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎం.సుధాకర్ (ప్రిన్సిపాల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భైంసా), ఉత్తమ అధ్యాపకులుగా డాక్టర్ పవన్‌కుమార్ పాండే (హిందీ సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భైంసా), పీజీ.రెడ్డి (చరిత్ర సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్), యూ.రవికుమార్ (ఆంగ్ల సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్), గోనెల సుభాష్(ఆంగ్ల సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భైంసా) ఎంపికయ్యారు. వీరిని మంగళవారం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో సత్కరిస్తారు.





దివ్యాంగుల అవస్థలు

నూతన సమీకృత కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన తొలి ప్రజావాణిలో అర్జీదారులు, దివ్యాంగులు వసతులు లేక అవస్థలు పడ్డారు. జిల్లాకేంద్రానికి 5 కి.మీ దూరంలో ఈ కార్యాలయం ఉంది. ఆటోలో రావాలంటే రూ.200లు ఖర్చవుతుందని వాపోయారు. దివ్యాంగుల కోసం ఏర్పాట్లు చేయకపోవడంతో వారికి ఇక్కట్లు తప్పలేదు. అధికారులు సమయానికి రాకపోవడంతో గంటల తరబడి పడిగాపులు కాశారు. అర్జీదారులు నిరీక్షించి వెళ్లిపోయారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

కార్మికుల సంక్షేమానికి కృషి


బీడబ్ల్యూఐ డైరెక్టర్ రాజీవ్‌శర్మను కలిసిన కార్మిక సంఘం ప్రతినిధులు

నిర్మల్‌ఖిల్లా: అంతర్రాష్ట్ర వలస కార్మికులు, గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కృషిచేయాలని ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల కోరారు. సంఘ ప్రధాన కార్యదర్శి నయిండ్ల రాజారెడ్డితో కలిసి బిల్డింగ్ అండ్ వుడ్ వర్కర్స్ ఇంటర్నేషనల్ కార్మిక సంఘం (బీడబ్ల్యూఐ) దక్షిణాసియా ప్రాంతీయ కార్యాలయ డైరెక్టర్ రాజీవ్ శర్మతో హైదరాబాద్‌లోని గోల్కొండ హోటల్‌లో సోమవారం భేటీ అయ్యారు. భవన నిర్మాణ రంగం కార్మికులకు శాశ్వతంగా గుర్తింపు కార్డు, బీడీ కార్మికులందరికీ పీఎఫ్ సౌకర్యం కల్పించడంపై చర్చించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రేరణశర్మ తదితరులు ఉన్నారు.